ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శుక్రవారం 19 ఏప్రిల్ 2024



పచ్చని కళ



ఈ దృశ్యం చూడడానికి రెండు కళ్లు సరిపోవడం లేదు కదూ..! ఇంతటి పచ్చదనం చూసి కోనసీమ అనుకునేరు.. మన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మైల్వార్-నీళ్లపల్లి సమీపంలోని పంటపొలాలు. యాసంగిలో రైతులు వరి సాగు చేయగా పైరు పచ్చదనంతో కళకళలాడుతోంది., పచ్చని పొలం గట్లతో ప్రకృతి అందాలు అదరహో అనిపిస్తున్నాయి. మండు వేసవిలోనూ కనుచూపు మేర పచ్చని పైరు కనువిందు చేస్తోంది. ఈ అందాలను చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. చేలు భూమాతకు పచ్చని చీర కట్టినట్టుగా ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు కొద్దిసేపు ఆగి పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు.

- బషీరాబాద్, ఏప్రిల్ 18



కీసరలో కురుస్తున్న వాన

దంచికొట్టిన వాన

● నాగారం, దమ్మాయిగూడల్లో భారీ వర్షం

కీసరరూరల్/ధారూరు, ఏప్రిల్ 18: ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుతున్న ఎండలు, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వానకు ఈదురు గాలులు తోడవడంతో ఫ్లెక్సీలు కొట్టుకుపోయాయి. రోడ్లన్నీ జలమయం కాగా, లోతట్టు ప్రాంతల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. అకాల వర్షంతో రోడ్లపై ఉన్న గుంతల్లోకి వర్షపునీరు చేరడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా కీసర, ధారూరులో చిరుజల్లులు కుసిశాయి. ఉదయం నుంచి ఎండతో ఇబ్బందులు పడిన జనాలకు సాయంత్రం కురిసిన వర్షం ఎంతో ఉపశమనం కలిగింది.



సిబ్బందితో మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

నేరాల నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలి

» రాచకొండ సీపీ తరుణ్ జోషి


కీసర,ఏప్రిల్ 18: నేరాల నియంత్రణకు పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి గురువారం కీసర పోలీస్ స్టేషన్‌ను సందర్శించి నేర నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పెండింగ్, గ్రేవ్ కేసుల విచారణ, ఇతర కేసుల విచారణ పురోగతిపై స్థానిక సీఐ వెంకటయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణకు అవసరమైన చట్టపరమైన చర్యలు అన్ని తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అదే విధంగా ఆపదలో ఎవ్వరైన పోలీస్ స్టేషన్‌కు గాని, 100 నంబర్‌పై వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. అనంతరం ఉద్యోగుల పనితీరుపై సలహాలు, సూచనలు తెలియజేశారు. అదే విధంగా లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు రూ. ఏడు కోట్ల వరకు నగదు పట్టివేత జరిగిందన్నారు. అదే విధంగా మద్యం పట్టివేత కూడా జరిగినట్లు తెలిపారు. ఎన్నికలకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ తరుణ్ జోషి తెలిపారు. కార్యక్రమంలో మాల్కాజ్‌గిరి డీసీపీ పద్మాజా, ఏసీపీ నరేందర్‌గౌడ్, కీసర పోలీస్ స్టేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ



రాకంచర్లలో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌అధికారులు

పరిగి,ఏప్రిల్ 18: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని పరిగి ఫైర్ స్టేషన్ అధికారి సేవ్యానాయక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం రాకంచర్లలోని పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే 101కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చంద్రమోహన్, చంద్రయ్య,శ్రీనివాస్, మదుమోహన్‌రావు, నిరంజన్ పాల్గొన్నారు. కాగా, వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేట సమీపంలోని దానెష్ మిల్‌లో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరినీ అగ్ని ఉనికి ప్రదేశాలు గుర్తించేలా అవగాహన కల్పించడం జరిగిందన్నారు.



రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉండే ప్రభుత్వ ఉద్యోగులపై ఎన్నికల సంఘం నిఘా పెంచింది. ఏ రాజకీయ పక్షానికి కొమ్ము కాసేలా వ్యవహరించినా వేటు వేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని రంగంలోకి దింపింది. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులతో సన్నిహితంగా మెలిగే ప్రభుత్వ ఉద్యోగుల వ్యవహార శైలిపై ఈసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. వారి రోజువారీ కార్యకలాపాలపైనే కాకుండా వారు ఉపయోగించే సామాజిక మాధ్యమాల ఖాతాలు, పోస్టులపైనా ఓ కన్నేసింది. ఏ పార్టీకి అనుకూలంగా వ్యవహరించినా.. ఏ అభ్యర్థికి సానుకూలంగా నడుచుకున్నా చట్టపరమైన చర్యలు తీసుకునేలా రంగం సిద్ధం చేసింది.



రంగంలోకి ప్రత్యేక యంత్రాంగం
చిన్నపాటి ఆధారం లభించినా సస్పెన్షన్ వేటు

హద్దు మీరితే అంతే!

ప్రభుత్వ ఉద్యోగులపై ఈసీ నజర్

సస్పెన్షన్ వేటు పడితే...

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో సస్పెన్షన్ వేటుకు గురైతే తిరిగి ఉద్యోగంలో చేరడం చాలా కష్టం. సాధారణంగా సస్పెన్షన్‌కు గురయ్యే ఉద్యోగులను ఆరు నెలలలోపు ఉద్యోగంలో తిరిగి చేర్చుకుంటారు. కానీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో తీవ్ర అభియోగాలతో ఎన్నికల సంఘం ఆదేశాలతో సస్పెన్షన్ వేటుకు గురైతే మాత్రం.. ఉద్యోగంలో ఎప్పుడు చేరతారనేది ఎన్నికల సంఘం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ఎన్నికల సంఘం అనుమతించిన తరువాతనే విధుల్లోకి తీసుకోవాల్సి ఉంటుంది. సస్పెన్షన్‌కు గురైతే తిరిగి ఉద్యోగంలో చేరడానికి ఎంత సమయం పడుతుందనేది ఎవరూ చెప్ప లేని పరిస్థితి.

ఆంధ్రజ్యోతి, వికారాబాద్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికలు మే 13న జరగనున్న నేపథ్యంలో తమ సత్తా చాటుకునేందుకు ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినా కొందరు తాము ప్రభుత్వ ఉద్యోగులమనే విషయాన్ని విస్మరించి రాజకీయ నాయకులతో ఇంకా అంటకాగుతూనేఉన్నారు. సాధారణంగా అభివృద్ధి కార్యక్రమాలు, సంఘాల సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో తాము రాజకీయ ముఖ్య నాయకులకు చాలా సన్నిహితులమనే విషయం అందరూ గుర్తించే విధంగా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరిస్తుంటారు. రాజకీయ పార్టీల నాయకులతో సన్నిహితంగా ఉండే ప్రభుత్వ ఉద్యోగుల సమాచారం సేకరించిన ఎన్నికల సంఘం వారిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాజకీయ నాయకులతో సన్నిహితంగా మెలిగే ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగుల కదలికలను నిఘా నేత్రాలు వెంటాడే విధంగా చర్యలు చేపట్టింది. ఎన్నికలు లేని సమయంలో రాజకీయ నాయకులతో ఎలా ఉన్నా ఎవరూ పట్టించుకోరు.. అదే ఎన్నికల సమయంలో అందరి దృష్టి ప్రభుత్వ ఉద్యోగులపై ఉంటుంది. సాధారణంగా ఉద్యోగ సంఘాల నాయకులకు మండల స్థాయి ప్రజాప్రతినిధుల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు, కొందరికి సీఎం స్థాయిలో పరిచయాలుంటాయి. అయితే ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు, నాయకులకు దూరంగా ఉండాల్సి ఉంటుంది.

ఏ చిన్న ఆధారం ఉన్నా.. సస్పెన్షనే..

ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా ఏ రాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినట్లు ఏ చిన్న ఆధారం లభించినా ఎన్నికల సంఘం సస్పెన్షన్ వేటు వేయనుంది. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ రాజకీయ పార్టీలకు లేదా అభ్యర్థులకు సహకరిస్తున్నారనే చిన్నపాటి ఆధారం లభించినా వేటు పడనుంది. రాజకీయ నాయకులతో సంప్రదింపులు చేసినా, సమావేశాల్లో పాల్గొన్నా, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించినా.. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకోనుంది. ప్రభుత్వ ఉద్యోగులు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్‌ల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా పోస్టులు నమోదు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవు. ముఖ్యంగా ప్రచార సమావేశాలు, సభల్లో పాల్గొనడం, లేదా తమ వర్గానికి చెందిన నేత అంటూ రహస్యంగా ప్రచారం చేసినా కూడా తీవ్రంగానే పరిగణించనున్నారు. ఎన్నికల ప్రచారం చేయడం, ఫలానా పార్టీ, అభ్యర్థికి ఓటు వేయాలని చెప్పడం కూడా తప్పిదంగానే భావిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు ప్రచారం చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు కూడా తమ పరిధి దాటి వ్యవహరించకూడదు. వారందరూ ఎన్నికల నియమావళికి లోబడి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

హద్దుమీరితే అంతే సంగతులు

సాధారణంగా ఎన్నికల సమయంలో రిసార్ట్స్, గెస్ట్‌హౌస్‌లు, ఫంక్షన్ హాళ్లలో ప్రభుత్వ ఉద్యోగులతో ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక విందు సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓట్లతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల ఓట్లు కూడా తమకే అనుకూలంగా వేసేవిధంగావారిని ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు అభ్యర్థిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు, డిమాండ్ల పరిష్కారంపై హామీలు ఇవ్వడమే కాకుండా వారు తమ వైపు మొగ్గు చూపే విధంగా ప్రయత్నాలు చేస్తుంటారు. ఇదంతా బహిరంగ రహస్యమే. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న ఈ సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాలు, విందు, వినోద కార్యక్రమాలకు హాజరు కాకూడదు. రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉండకూడదు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు దూరంగా ఉండాలి. వివిధ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాలపై కూడా ఎన్నికల సంఘం నిఘా ఉంచింది. అయితే ఎన్నికల సంఘం ఎన్ని ఆంక్షలు విధించినా జిల్లాలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తమకు అనుకూలంగా ఉండే రాజకీయ పార్టీల నాయకులతో రహస్య సమావేశాలు కొనసాగిస్తూనే ఉండడం గమనార్హం.

నిబంధనలు ఉల్లంఘిస్తే సీరియస్

జిల్లాలో ఎనిమిది వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వరంగ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా, వారిలో 80 శాతం మంది వరకు ఎన్నికల విధుల్లో పాలుపంచుకుంటారు. ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషిస్తారు. క్లాస్ - 4 ఉద్యోగులను మినహాయించి మిగతా ఉద్యోగ, ఉపాధ్యాయులు అతి ముఖ్యమైన ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తరువాత సాధారణ పరిపాలనా అంశాలు మినహా మిగతా అధికారాలు ఎన్నికల సంఘానికి బదిలీ అవుతాయి. పరిపాలనా పరమైన అంశాలు మినహా ఇతర నిర్ణయాలు ఏమైనా అమలు చేయాలంటే ప్రభుత్వం ఎన్నికల సంఘం ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండడంతో తమ దృష్టికి వచ్చే ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం పరిశీలిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం నిబంధనల ఉల్లంఘన జరగకుండా.. ప్రవర్తనా నియమావళి అమలయ్యేలా చర్యలు తీసుకుంటోంది.



బెల్టు తీసేనా!

యథేచ్ఛగా వీధికో బెల్టు దుకాణం

» నిద్రమత్తులో ఎక్సైజ్ అధికారులు
» తమ పరిధి కాదంటూ దాటవేస్తున్న పోలీసులు
» ఎన్నికల సమయంలో అక్రమ కేసులు

వికారాబాద్, ఏప్రిల్ 18: పట్టణాలు, గ్రామాలు అనే తేడాలేకుండా అక్రమ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. ఏ వీధిలో చూసినా బెల్టుషాపులే దర్శనమిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగిన బెల్టు దుకాణాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో మద్యం దుకాణాలు లేకుండా చేస్తామని వాగ్దానాలు చేసినా ఇంతవరకూ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మరోవైపు ఎక్సైజ్ అధికారులు గానీ, పోలీసులు గానీ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. పోలీసు అధికారులను ప్రశ్నిస్తే అది తమ పరిధి కాదని దాటవేస్తున్నారు. అలా చెప్తూనే బెల్టు షాపులు, వైన్స్ షాపుల వద్ద జిల్లాలోని పలువురు పోలీసులు చేతులు చాచుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బెల్టుషాపులు లేవంటూ సమాధానాలు

పట్టణాలు, గ్రామాల్లో ఉదయం, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. బెల్టుషాపులు లేవని అధికారులు చెబుతున్నా అవి కాకీ లెక్కలుగానే మిగులుతున్నాయి. నూతనంగా ఎక్సైజ్ శాఖ మద్యంపాలసీని తీసుకు వచ్చి ఎంఆర్‌పీ ధరలకే మద్యం విక్రయించేలా కల్తీమద్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే వారు పట్టించుకోకపోవడంతో బెల్టు షాపు నిర్వాహకులకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఒక్కో గ్రామంలో 10బెల్టుషాపులు ఉన్నాయంటే అక్రమ మద్యం ఏమేర ఏరులై పారుతుందో అర్థం చేసుకోవచ్చు. వికారాబాద్ మండలంలోని మైలార్ దేవరంపల్లి, మద్గుల్ చిట్టంపల్లి, సిద్దులూరు, పూడురు మండలం చీలాపూర్ ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ గ్రామంలో బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి.

> **బెల్టు షాపులను మూయిస్తాం**
>
> గ్రామాల్లో, ఆయా కాలనీల్లో ఉన్న బెల్టుషాపులపై దృష్టిపెట్టి వాటిని తొలగిస్తాం. గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
>
> రఘువీణ, వికారాబాద్
> ఎక్సైజ్ సీఐ

ఎనీటైం మద్యం

గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెల్టుషాపులు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటున్నాయి. గ్రామాల్లోని కూలీలు మద్యానికి బానిసలై పనులకూ వెళ్లకుండా బెల్టుషాపుల్లోనే తాగితూగుతున్నారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు సిండికేట్‌గా మారడంతో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. హోటళ్లు, కిరాణా షాపులు బెల్టుషాపుగా తయారవుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లాభార్జనే ధ్యేయంగా గ్రామీణ ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు. రహదారుల వెంబడి మద్యాన్ని విక్రయించొద్దని నిబంధనలున్నా గ్రామాల్లో రోడ్ల పక్కనే దర్జాగా మద్యం విక్రయిస్తున్నారు. వ్యాపారులు అటు పోలీసులకు ఇటు ఎక్సైజ్ అధికారుల చేతులు తడిపి తమ వ్యాపారాన్ని నిరాటంకంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ర వెల్లువెత్తుతున్నాయి.

అధికారులపై విమర్శలు

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరుకు చెందిన సంతోష్‌కుమార్ తన కుమారుడి జన్మదిన సందర్భంగా మన్నెగూడకు వచ్చి మద్యం కొనుగోలు చేశాడు. ఎక్సైజ్ శాఖ చట్టం 1968 ప్రకారం ఒక వ్యక్తి దగ్గర ఆరు సీసీలు మద్యం ఓ కార్టన్ బీర్లు ఉండవచ్చు. కారులో నాలుగు కార్టన్ల బీర్లు, నలుగురు వ్యక్తులు ఉన్నారు. తనిఖీ చేసిన అధికారులు మాత్రం కారులో ఉన్న ముగ్గురిని మినహాయించి ఒక్కరిపైనే కేసు నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారులకు లెక్కలు చూపడానికే తప్ప నిబంధనలు పాటించని అసలైన వ్యక్తులపై కేసులు నమోదు చేయడంలేదని పలువురు మండిపడుతున్నారు.

నామినేషన్లు షురూ

» ఉమ్మడి జిల్లాలో 11మంది నామినేషన్లు దాఖలు » మల్కాజిగిరి స్థానానికి 8 నామినేషన్లు
» చేవెళ్ల లోక్‌సభ స్థానానికి తొలిరోజు మూడు నామినేషన్లు
» నామినేషన్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు » అభ్యర్థి వెంట ఐదుగురికి మాత్రమే అనుమతి

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/శామీర్ పేట/రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం షురువైంది. గురువారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి గురువారం మొదటి రోజు 8 మంది 9 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. బీజేపీ అభ్యర్థులుగా ఈటెల రాజేందర్, ఆయన సతీమణి జమున వేర్వేరుగా నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్రులుగా పాలాది పవన్‌కుమార్, బ్యాగరి లోకేష్, చిలక చంద్రశేఖర్, మాలోత్ శంకర్, పెసరికాయల పరిక్షిత్‌రెడ్డి(రెండు సెట్లు), అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా మేడే సత్యం నామినేషన్ వేశారు. 8 మంది 9 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఇదిలా ఉంటే ఈటల రాజేందర్ నామినేషన్ సమయంలో ఆయన వెంట నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఉన్నారు. నామినేషన్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇతరులను లోపలికి రానివ్వలేదు. అభ్యర్థి వెంట అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించే ఐదుగురిని మాత్రమే అనుమతించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ఈటల సతీమణి జమున

భారీ ర్యాలీతో నామినేషన్‌కు తరలిన ఈటల

ఈటల రాజేందర్ నామినేషన్‌కు బీజేపీ కార్యకర్తల, జన సందోహంతో అర్కల్‌గూడలోని తన నివాసం నుంచి ద్విచక్రవాహన ర్యాలీతో బయల్దేరారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా తూంకుంట నుంచి దొంగల మైసమ్మ చౌరస్తా మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్ వేశారు. కాగా ఈటల నామినేషన్ సందర్భంగా శామీర్‌పేటలోని పెద్దచెరువు కట్టమైసమ్మ ఆలయానికి ఆయన సతీమని జమున, కుటుంబీకులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. నామినేషన్ పత్రాన్ని అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్, పవన్‌గౌడ్, మైసయ్య, రాములు తదితరులు ఉన్నారు.

చేవెళ్ల స్థానానికి మూడు నామినేషన్లు

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి రోజు చేవెళ్ల స్థానానికి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా పాల్మాకుల మధు ఆర్వోకు నామినేషన్ అందజేశారు. సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బి.వెంకట్‌రమేష్‌బాబు, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ ముస్తఫా రిజ్వాన్ నామినేషన్ దాఖలు చేశారు. ముగ్గురూ ఒక్కోసెట్ నామినేషన్ వేశారు.



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

అనారోగ్యంతో ఉంటే పనిలోకి తీసుకోవద్దు

● వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 18: వేసవిని దృష్టిలో ఉంచుకొని జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులకు అనారోగ్యంతో ఉన్న కూలీలను పనిలోకి తీసుకోవద్దని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా బుధవారం మాట్లాడుతూ.. జిల్లాలో పార్లమెంట్ ఎన్నిక ఎన్నికల నేపథ్యంలో డిజిట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. అట్టి నోటిఫికేషన్‌ను ప్రతి ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్డీవో, ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిస్‌ప్లే చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లేబర్ మొబిలైసేషన్ జరగాన్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లను బాగుచేయడం, ముండ్ల పొదలు తొలగించడం, ఇరిగేషన్ పనులు జరగాలని, ఇప్పటి వరకు పూర్తయిన పనులకు తప్పనిసరిగా ఎఫ్‌టీవో జనరేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, జయసుధ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐఏఎస్ సాధించిన తరుణ్‌కు సన్మానం



తరుణ్‌ను సన్మానిస్తున్న తిర్మల్‌రావు, ఎండీ ఖలీల్‌పాషా

పూడూరు, ఏప్రిల్ 18: మండలం లోని మంచన్‌పల్లికి తరుణ్ ఐఏఎస్ సాధించడం పట్ల గ్రామస్తులు సన్మానించారు. గ్రామానికి చెందిన తిర్మలరావు, ఎండీ.ఖలీల్‌పాషా తరుణ్ నివాసానికి వెళ్లి గురువారం పూలమాల, శాలువాతో సన్మానించి అభినందించారు. వృత్తిలో ఉన్నతస్థాయికి ఎదిగి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు.



బీఫాం అందుకుంటున్న చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫాం

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/ఇబ్రహీంపట్నం/చేవెళ్ల, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బీఫాంలు అందజేశారు. ఈమేరకు మల్కాజిగిరి, చేవెళ్ల, భువనగిరి స్థానాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, క్యామ మల్లేష్‌లకు తెలంగాణ భవన్‌లో గురువారం బీఫాం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేషం, దయానందర్ గుప్తా, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జి.జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు ఉన్నారు.






కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్

ప్రజలతోనే ఉంటా.. వారికోసమే కొట్లాడతా

- మోదీ చేసిన అభివృద్ధే 'కొండా' గెలుపునకు బాటలు
- దేశంలో మోదీ వేవ్.. నో కరప్షన్.. ఓన్లీ డెవలప్‌మెంట్
- బీఆర్ఎస్ వీక్.. కాంగ్రెస్‌తోనే పోటీ..
- ఆరు గ్యారంటీలు అమలు కల్ల రాహుల్ గాంధీ ప్రధాని కావడం అసాధ్యం
- మీడియా సమావేశంలో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 18 : తాను ప్రజలతోనే ఉంటానని.. వారికోసమే కొట్లాడతానని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ చేసిన పనులే తన గెలుపునకు బాటలన్నారు. ప్రస్తుతం దేశంలో మోదీ వేవ్ నడుస్తోందని.. నో కరప్షన్.. ఓన్లీ డెవలప్‌మెంట్ అని చెప్పారు. బీజేపీ విధానం అంత్యోదయ అని చెప్పారు. కాంగ్రెస్‌ది.. చేయి గుర్తు కాదు.. చెంప దెబ్బ గుర్తు అని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం అసాధ్యమని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలుకావన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్ర నిధులు అన్ని పార్టీల సర్పంచ్‌లకు రాజకీయాలకతీతంగా ఇవ్వడం జరిగిందన్నారు. రూ.11 కోట్ల నిధుల్లో 1,094 పనులకు రూ.7 కోట్లపై చిలుకు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి కేవలం 49 పనులు మాత్రమే చేపట్టడం జరిగిందని విమర్శించారు. తాను హైవే ప్రస్తావన పార్లమెంట్‌లో మాట్లాడి తేవడం జరిగిందని, కేంద్రమంత్రి గడ్కరీ శంకుస్థాపన చేసిన అప్పా జంక్షన్ టూ మన్నెగూడ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయడం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చేతకాలేదని తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్ట్ అభివృద్ధికి వంద కోట్లు తీసుకువచ్చినట్లు చెప్పారు. తాండూరులో నాపరాతి పరిశ్రమకు జీఎస్టీ 18 నుంచి 5 శాతం వరకు తీసుకు వచ్చినట్లు తెలిపారు. తనను మరోసారి చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే.. వికారాబాద్ నుంచి తాండూరు వరకు నాలుగు లేన్ల రోడ్డు, శంకర్‌పల్లి నుంచి వయా మోమిన్‌పేట రోడ్డు, అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు విస్తరణ పనులు పూర్తిచేయిస్తానని చెప్పారు. శంకర్‌పల్లి నుంచి తాండూరు వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకురావడంలో బీఆర్ఎస్ చేతులెత్తేసిందన్నారు. చేవెళ్లలో త్వరలో బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని,ప్రధాని మోదీ హాజరుకానున్నట్లుచెప్పారు.

బీఆర్ఎస్ వీక్.. కాంగ్రెస్‌తోనే పోటీ..

బీఆర్ఎస్ చాలా వీకైందని, కాంగ్రెస్‌తోనే తనకు పోటీ అని కొండా అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ అకాక్కులు చవాక్కులు వేయడం సరైంది కాదని, బీఆర్ఎస్ డమ్మీ క్యాండెట్‌ను పెట్టారనటం తప్పు అని, ఆయన పెద్ద మనిషి. ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి అని తెలిపారు.

'69' ఘోరమైన జీవో

ఎన్నికలు వచ్చినప్పుడల్లా జీవో 111పై నేతలు వాగ్దానాలు ఇస్తున్నారని, చేవెళ్ల, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు యాదయ్య ప్రకాశ్‌గౌడ్‌లు ప్రతి ఎన్నికల్లో ఇదే చెబుతున్నారని తెలిపారు. జీవో 111 రద్దు చేసి అంతకన్నా ఘోరమైన 69 జీవో తీసుకువచ్చారని, ఈ జీవో ఉల్టాపల్టాగా ఉందన్నారు.

కరోనా సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు

కరోనా కాలంలో తాను ఎన్నో సేవలందించినట్లు విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. శానిటైజర్ తయారుపై అవగాహన కల్పించడం, గ్లౌస్, మాస్కులు పంపిణీ చేయడం, చేవెళ్లలో 15 బెడ్లతో ఐసోలేషన్ సెంటర్, డాక్టర్లకు ప్రత్యేక మాస్కులు, మహావీర్ ఆసుపత్రిలో 20 నేచురల్ వెంటిలేటర్లు తయారు చేసి అందించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా ఇండియన్ కొవిడ్ వెంటిలేటర్‌ను తాను తయారు చేయడం జరిగిందన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేతలు

శంషాబాద్ రూరల్/రాజేంద్రనగర్ : శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఊట్‌పల్లి, కిషన్‌గూడ, తొండుపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బంజరాహిల్స్‌లోని ఆయన నివాసంలో బీజేపీలో చేరారు. షైలార్ దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది బీఆర్ఎస్ జాగృతి రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కొండా పరమేష్‌గౌడ్, దూదే నర్సింహ, కొడూరి సురేందర్, మల్లేష్‌కుమార్, రామకృష్ణ సిద్దులుగౌడ్‌తో పాటు మరికొంతమంది నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా కొండా కండువాలు కప్పి ఆహ్వానించారు మల్లారెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్, భీమార్జున్‌రెడ్డి, కౌన్సిలర్ కొండా ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

వికారాబాద్ : ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని కచ్చితంగా పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగుర వేస్తామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డిలు అన్నారు. వికారాబాద్‌లోని గంగారంలోని నాలుగు వార్డుల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ధారూరు: మండలంలోని చింతకుంట, హరిదాసుపల్లి గ్రామాలలో గురువారం చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

తాండూరు రూరల్: ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, గౌతాపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి(సాయిరెడ్డి) బీఆర్ఎస్ పార్టీ రాజీనామా చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలోబీజేపీలో చేరారు.



సాల్విడ్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

మోమిన్‌పేట, ఏప్రిల్ 18: మండలంలోని వెల్చాల్, మొరంగపల్లి గ్రామాల్లో గురువారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని చూసి తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మొరంగపల్లి నర్సింహారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఎర్ర సత్యం, నర్సింహులు, ఆమ్రాది మహేశ్, మండల బాల్‌రాజ్ పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని సాల్విడ్‌లో గురువారం బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్యరెడ్డి మాట్లాడుతూ మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ కార్యకర్తలు బీజేపీ గెలుపునకు కృషిచేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థిని గెలిపించి పీఎం మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, మండల అధ్యక్షుడు సూర్యకాంత్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, నర్సింహారెడ్డి, యువ మోర్చా మండల అధ్యక్షుడు గడుసు మహిపాల్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, మండల కోషాధికారి కె.మహిపాల్, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



గుర్రంపల్లిలో మాట్లాడుతున్న డీసీపీ నారాయణరెడ్డి

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

చౌదరిగూడ/కొందుర్గు, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూడాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సూచించారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో సమస్యాత్మక గ్రామాలైన కాస్లాబాద్, పెద్ద ఎల్కిచర్ల, గుర్రంపల్లిల్లో ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాల పాఠశాలను డీసీపీ పరిశీలించారు. గుర్రంపల్లి పోలింగ్‌స్టేషన్ వద్ద సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రహరీలు లేని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై నక్రం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, ఆంజనేయులు, ప్రసాద్ ఉన్నారు. అలాగే కొందుర్గులోని జెడ్పీ పాఠశాల పోలింగ్‌స్టేషన్‌ను డీసీపీ నారాయణరెడ్డి సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఆయనతో ఎస్సై కృష్ణయ్య ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో గీతారెడ్డి

ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి

తలకొండపల్లి, ఏప్రిల్ 18 : ఎరువులు విక్రయించే డీలర్లు రైతులకు రషీదులు తప్పక ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. గురువారం తలకొండపల్లిలో ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. అనంరతం మాట్లాడుతూ డీలర్లు నిబంధనలు పాటించాలన్నారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. ఈ-పాస్ విధానంలో ఎరువులు విక్రయించాలన్నారు. సాగులో రైతులు మెలకువలు పాటించాలన్నారు. ఆమె వెంట ఏవో రాజు, ఏఈవోలు ఉన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు



కుసుమ సముద్రం నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

కులకచర్ల, ఏప్రిల్ 18: వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం గతంలో ఉపాధిహామీ పథకంలో నీటితొట్లు నిర్మించింది. గ్రామాల్లో నీటి సౌకర్యం ఉన్న ట్యాంకులు, పబ్లిక్ కుళాయిల దగ్గర వీటిని నిర్మించారు. కానీ సంబంధిత అధికారులు నీటితొట్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. చాలా గ్రామాల్లో నీటి తొట్లు శిథిలావస్థకు చేరాయి. వాటి నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతో కొన్నేళ్లకే చాలా వరకు దెబ్బతిన్నాయి. మండలంలోని చెరువు కుంటల్లో నీరు తగ్గి పోయింది. బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో పశుపోషకులు మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కుసుమ సముద్రం, అనంతసాగర్, బండవెల్కిచర్ల, అంతారం, సాల్విడ్ గ్రామాల్లో నీటితొట్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వీటి నిర్వహణ చేపట్టాలని అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పశువుల దాహార్తిని తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏసీపీ కె.వెంకట్‌రెడ్డి, సీఐ హనుమాన్‌గౌడ్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 18: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ కె.వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించడానికి గురువారం మేడ్చల్ ట్రాఫిక్ పీఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదాలను అరికట్టటంతో పాటు నిబంధనలను అతిక్రమించి వాహనాలు తోలేవారి పట్ల తగుచర్యలు తీసుకోవడానికి తమ సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. ర్యాష్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, రాంగ్ పార్కింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, శబ్దం ఎక్కువగా వచ్చే సైలెన్సర్లను బిగించడం, గడువు ముగిసిన వాహనాలను రోడ్డుపై నడపటం, అతివేగం, ట్రిబుల్ రైడింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం లాంటివి ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ కిందికి వస్తాయని తెలిపారు. నిబంధనలను అతిక్రమించే వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. సైరన్‌లు బిగించుకున్న వాహనాలకు సంబంధించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.



ఇసుక ట్రాక్టర్ సీజ్

కులకచర్ల, ఏప్రిల్ 18: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను కులకచర్ల పోలీసులు సీజ్ చేశారు. అనంతసాగర్ గ్రామానికి చెందిన మహేశ్ ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నాడు. ఈ క్రమంలో విధి నిర్వాహణలో ఉన్న పోలీసులు ఘనపూర్ గేటు సమీపంలో ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని మహేశ్, డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కొడంగల్/దోమ, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం నుంచి ఈనెల 25వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ జాబితా ప్రతులను అతికించనున్నట్లు తెలిపారు. మే 13న పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దోమ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ వేస్తున్న తహసీల్దార్ పురుషోత్తం



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఏఆర్‌వో కార్యాలయం నుంచి ఎన్నికల విధులు నిర్వహించాలి

వికారాబాద్, ఏప్రిల్ 18: పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు(గురువారం) నుంచి సిబ్బంది ఏఆర్‌వో కార్యాలయం నుంచి ఎన్నికల విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గురువారం జిల్లాలోని వికారాబాద్ నియోజక వర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో మైనార్టీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి

కందుకూరు ఏప్రిల్ 18: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) కోరారు. గురువారం వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఎగిరిశెట్టి నర్సింహల ఆధ్వర్యంలో నేదునూరు పార్టీ అధ్యక్షుడు బొర్ర సురేష్, పార్టీ నాయకులు తుక్కుగూడలోని కేఎల్లార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఒబీసీ సెల్ నేదునూరు శాఖ అధ్యక్షుడు భాస్కర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు జగన్, నాయకులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పాటుపడాలి

భారత రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య లౌకికవాద, సామాజిక న్యాయం కోసం ప్రజాప్రతినిధులు, పాలకులు కృషిచేయాలని దళిత, బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండు నర్సింహ కోరారు. ఈ మేరకు గురువారం పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు.

కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా తయారు చేయాలి

మహేశ్వరం/మియాపూర్ : మహేశ్వరంలో కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా తయారు చేయాలని మండల మాజీ ఎంపీపీ కె.రఘుమారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గట్టుపల్లి మాజీ సర్పంచ్ సౌడయ్య, మాజీ ఎంపీటీసీ సావిత్రిలతో పాటు మరికొందరు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రఘుమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ సర్పంచ్ రాకేష్‌రెడ్డి, ఎండీ సాబేర్, ఎర్ర యాదగిరి, కుమార్, రాజు, రమేష్, మహ్మద్, అంజయ్య తదితరులున్నారు. శేరిలింగంపల్లి నియోకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ హఫీజ్‌పేట డివిజన్ ఓల్డ్ హఫీజ్‌పేట, రాయదుర్గంలో కార్పొరేటర్ పూజితతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



మహేశ్వరం : కాంగ్రెస్‌లో చేరుతున్న గట్టుపల్లి మాజీ సర్పంచ్ సాడయ్య, మాజీ ఎంపీటీసీ సావిత్రి

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

మొయినాబాద్ రూరల్ : మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ రంజిత్‌రెడ్డికి ఓటు వేయాలని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. కేసరి సంజీవరెడ్డి, షాబాద్ దర్శన్, గౌరి సతీష్, పార్టీ మండలాధ్యక్షుడు మాణెయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

చేవెళ్ల : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని భీంభరత్, చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డి కోరారు. చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శంకర్‌పల్లి మండలం మీర్జగూడ, ఇంద్రారెడ్డినగర్ ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి జ్యోతి భీంభరత్, మండల అధ్యక్షురాలు దేవర సమతరెడ్డి, ప్రధాన కార్యదర్శి సరితా రెడ్డి, చేవెళ్ల, రావులపల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి

షాబాద్ : కాంగ్రెస్‌తోనే దేశం అభివృద్ధి చెందుతుందని పామెన భీంభరత్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్‌రెడ్డిలు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నసోలిపేట్, పెద్దసోలిపేట్ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, ఎంపీటీసీ జయమ్మవెంకట్‌రెడ్డి, నాయకులు జనార్దన్ రెడ్డి, పెంటారెడ్డి, తొంట వెంకటయ్య, సుభాష్‌రెడ్డి, వేణు, చేవెళ్ల స్వామి, నరేందర్ పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

వికారాబాద్ : కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. నవాబుపేట మండలంలోని మమ్‌దాన్‌పల్లి, కుమ్మరిగూడా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, కర్ణం రఘు తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కులకచర్లలోని పీజేఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, జిల్లా యువజన నాయకులు రుతిక్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, బ్లాక్ బీ కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ మొగులయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టీఎస్ అంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, ఎంపీటీసీ ఆనంద్ పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బర్కత్‌పల్లిలో విద్యపై అవగాహన


కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

పూడూరు, ఏప్రిల్ 18: ప్రథం సంస్థ ఆధ్వర్యంలో విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. బర్కత్‌పల్లిలో గురువారం విద్యార్థులు తమ విద్యలో వృద్ధి చెందడానికి వేసవి శిబిరాల్లో భాగంగా తల్లిదండ్రుకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. మండలంలోని 25గ్రామాలకు కథల పుస్తకాల కిట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రథం సంస్థస్టేట్ హెడ్ రాంబాబు, ప్రోగ్రాంహెడ్ సుధాకర్, మండల విద్యాధికారి హరిశ్చందర్, హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయుడు అరుంధతి, జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటయ్య, మండల కో-ఆర్డినేటర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ కంపెనీపై ఫిర్యాదు

ధారూరు, ఏప్రిల్ 18: మండలంలోని స్టేషన్ ధారూరు శివారులోని టెక్స్‌టైల్ కంపెనీపై మాజీ ఉపసర్పంచ్ యాదయ్య గురువారం ఎంపీవో షఫీఉల్లాకు ఫిర్యాదు చేశారు. కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ, వ్యర్థ రసాయనాల వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కంపెనీలో పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మించిన గోదాంలకు యాజమాన్యం పంచాయతీకి పన్నులు చెల్లించడంలేదని ఆయన చెప్పారు. విచారణ జరిపి కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎంపీవోను కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 18: ఐనన్‌పల్లి గ్రామంలో చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి గురువారం పర్యటించారు. గ్రామంలో రోడ్ల మరమ్మతులు, తాగునీరు, దేవాలయ నిర్మాణం, గ్రామ అభివృద్ధిపై చర్చించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, వైస్ ప్రెసిడెంట్ యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేస్తేనే పదవులు

దోమ, ఏప్రిల్ 18: ప్రజల కోసం పనిచేస్తేనే పదవులు వాటంతట అవే వస్తాయని యూత్ కాంగ్రెస్ దోమ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదన్నారు. స్వార్థం కోసం పనిచేస్తే పదవులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పరిగి ప్రజల సంక్షేమానికి ఆస్తులు అమ్ముకొని సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. శరత్‌కుమార్‌రెడ్డి మాదిరిగా పూటకో పార్టీ మారే నాయకుడు రామ్మోహన్‌రెడ్డి కాదని, పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేసే నాయకుడన్నారు. మరోసారి ఎమ్మెల్యే పట్ల లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీని ఓడిస్తాం


అల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు రూరల్, ఏప్రిల్ 18: మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని ఓడించి మాదిగలకు మద్దతు తెలిపిన బీజేపీని గెలిపిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ అన్నారు. మండలంలోని అల్లాపూర్ గ్రామంలో బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం బీజేపీకి మద్దతిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ రావణ్, ఎమ్మార్పీఎస్ మండల, గ్రామ నాయకులు, ఆర్.ప్రవీణ్, మండల అధికార ప్రతినిధి జగదీష్, మండల ఉపాధ్యక్షుడు విజయ్, పరుశురాం, జి.ప్రవీణ్, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వంగ వెంకటనర్సింహారెడ్డి

శామీర్‌పేట, ఏప్రిల్ 18: మండుతున్న ఎండా కాలంలో ప్రజల, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వీఎస్ఆర్ ధ్యేయమని ఆర్గనైజర్ వంగ వెంకటనర్సింహారెడ్డి తెలిపారు. శామీర్‌పేటలోని దర్గా ఎదురుగా వీఎస్ఆర్ సంస్థ యజమాని ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎస్ఆర్ సంస్థ యజమాని వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ తమ వీఎస్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో గత 11 ఏళ్లుగా ప్రతీ ఎండాకాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ చలివేంద్రాలతో ప్రయాణికుల, పాదాచారుల, ప్రజల దాహాన్ని తీర్చుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వంగ సంజీవరెడ్డి, పెద్ద శ్రీనివాస్, సుభాష్‌రెడ్డి, జావిద్, ఆష్ క్రికెట్ అకాడమి ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రమేష్


రమేష్

తాండూరు, ఏప్రిల్ 18 : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తాండూరుకు చెందిన ఉప్పరి రమేష్‌ను నియమిస్తూ రాష్ట్రపార్టీ ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నియామకపత్రాన్ని జారీ చేశారు. ఈనియామకాన్ని రాష్ట్రపార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం జరిపినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు వారికి ఎంతో రుణపడి ఉన్నానని రమేష్ తెలిపారు. గతంలో రమేష్, కారాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శిగా కూడా పనిచేశారు.

భానుడి భగభగ.. జనం బేజారు


తాండూరులో ఎండవేడిమికి కూలీలు లేక నిర్మానుష్యంగా మారిన నాపరాతి గని

తాండూరురూరల్, ఏప్రిల్ 18: భానుడి భగభగతో ప్రజలు బేజారవుతున్నారు. ఉదయం 9గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అయితే రోజురోజుకు పెరుగుతున్నాయి. వ్యవసాయ, నాపరాతి గనుల్లో పనులకువెళ్లే దినసరి కూలీలు ఉదయం 10గంటలకే ఇంటిబాట పడుతున్నారు. భానుడి భగభగతో మండలం నిప్పులకొలిమిగా మారింది. మధ్యాహ్నం 3గంటల వరకు ఎండవేడిమి తగ్గుముఖం పట్టడంలేదు. రాత్రి 7గంటల వరకూ జనం ఉక్కపోతతో అల్లాడుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో పరిస్థితి ఇలాఉంటే మే నెలలో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది సుమారు 40 నుంచి 41డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈసారి కూడా 41డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండలంలోని ఓగీపూర్, మల్కాపూర్, కరన్‌కోట్, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, సంగెంకలాన్, కొత్లాపూర్, సిరిగిరిపేట్, కోటబాస్పల్లి, తదితర గ్రామాల పరిధిలో నాపరాతి గనులు విస్తరించి ఉండటంతో ఈప్రాంతాల్లో ఎండ వేడిమి అత్యధికంగా ఉంటుంది. ఈ వేడిమితో కూలీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో రద్దీ మార్గాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల ప్రభావంతో మార్కెట్‌లో కొబ్బరి బోండాలు, శీతల పానియాలు, మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లు, జ్యూస్‌ల విక్రయాలు జోరుగాసాగుతున్నాయి. ఎండాకాలం ప్రారంభం కావడంతో పలు గ్రామాల్లో చిన్నచిన్న వ్యాపారస్తులు జ్యూస్ బండ్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

ప్రతీఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలి

- వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

పరిగి, ఏప్రిల్ 18: ప్రతీ ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాల్సిందేనని వికారాబాద్ ఆర్డీవో, పరిగి ఏఆర్వో ఎం.వాసుచంద్ర అన్నారు. పరిగి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అన్ని మండలాల తహసీల్దార్లు, మీడియా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న సువిధ, సి-విజిల్, సురక్ష, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ యాక్టుల గురించి వివరించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వివరాలు నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఎన్నికలకోడ్ అమలుపై మూడు ఎఫ్ఎస్‌టీ బృందాలు నిరంతరంగా పర్యటిస్తున్నాయని తెలిపారు. ఈవీఎంలు, వీవీప్యాడ్‌లు కూడా పరిగికి వచ్చాయని చెప్పారు. పరిగిలో హెల్ప్‌డెస్క్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,66,291 ఓటర్లు ఉన్నారని, వీరిలో 1,33,451 పురుషులు, 1,32,831 మహిళలు, తొమ్మిది మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. సమావేశాలు, ర్యాలీలకు సంబంధించి అనుమతికోసం సువిధ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఫ్లెక్సీలుగానీ, జెండాలు కానీ వ్యక్తిగత ఇళ్లపై పెట్టిన ఇంటియజమాని అనుమతిపత్రాన్ని రాయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. నిబంధనలకు ఉల్లంఘిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో 8 పోలింగ్ కేంద్రాలు

పెద్దేముల్, ఏప్రిల్ 18 మండలంలో కొత్తగా 8పోలింగ్ కేంద్రాలు మంజూరైనట్లు తాండూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో పోలింగ్ కేంద్రాల పెంపుతో సొంతూరులోనే ఇకనుంచి ఓటువేసే సౌకర్యం కలిగింది. పెద్దేముల్ మండలంలో ప్రజలకు పాలనా సౌలభ్యం కోసం గతప్రభుత్వం కొత్తగా గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. పంచాయతీలుగా మారినా అక్కడ పోలింగ్ కేంద్రాలు మాత్రం ఏర్పాటు చేయ ఎన్నికల కమీషన్ నియమనిబంధనల ప్రకారం పెద్దేముల్ మండలంలో అర్హత కలిగిన ఊరెంటితండా, సిద్దన్నమడుగుతండా, ఎర్రగడ్డతండా, జయరాంతండా(ఐ), ఖానాపూర్, కందనెల్లితండా, మారెపల్లితండా, బండపల్లి గ్రామాలను గుర్తించి వాటి పేర్లు గతనెలలో సీఈవో కార్యాలయానికి పంపించారు. అధికారులు పంపించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

దత్తత గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సంస్థ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ సురేష్, తదితరులు

పూడూరు, ఏప్రిల్ 18: హైదరాబాద్ గచ్చిబౌలి సైబేజ్ సంస్థ దత్తత గ్రామాలు పూడూరు మండలంలోని సిరిగిగాయిపల్లి, సోమన్‌గుర్తిలో పూర్తయిన అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపలు చేశారు. సైబేజ్ ఆశ ప్రోగ్రాం ద్వారా దత్తత గ్రామం సిరిగాయిపల్లిలో రూ.9.60లక్షలతో 234 కిలోమీటర్ల మేర సీసీరోడ్డు పూర్తి కావడంతో కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ మమునూరు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామాన్ని సందర్శించారు. అంతకుముందు పాఠశాల గోడలకు వేయించిన పేయింటింగ్స్, గ్రామంలో వేసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను పరిశీలించారు. అదేవిధంగా సోమన్‌గుర్తిలోని దత్తత పాఠశాల అయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.7లక్షలతో 101 మీటర్ల పాఠశాల కంపౌండ్‌వాల్‌తోపాటు రంగు రంగుల చిత్రాలు వేయించారు. అట్టి పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా విద్యార్థులు చేతులు కడుక్కునేందుకు, తాగునీటి కోసం నిర్మించిన హ్యాండ్ వాష్ యూనిట్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ సీని యర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సైబేజ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 18: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష పాలిసెట్ రాయదలచిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22వ తేదీ రెండు వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మే 24వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 18: డిపో ఆదాయం రోజూ రూ.లక్ష పెంచే దిశగా విధులు నిర్వహిస్తామని గురువారం మేడ్చల్ ఆర్టీసీ కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఇచ్చిన ఆదేశాల మేరకు లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా డిపో కార్మికులు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఏ.సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, డ్రైవర్, కండక్టర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పూడూరు, ఏప్రిల్ 18: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రత్లావత్ శాంతిబాయి, కిషన్ నాయక్ కుమార్తె సురేఖ వివాహం గురువారం జరిగింది. ఇట్టి వివాహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెంటయ్య హాజరై వారికి రూ.11వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయం


కాంగ్రెస్‌లో చేరిన కొర్రెముల మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డుసభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 18: బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని కొర్రెముల మాజీ ఉపసర్పంచ్ కందుల రాజు, మాజీ వార్డుసభ్యులు ఆంజనేయులు, జువ్వ స్వామి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎం.సంతోష్‌గౌడ్, బీఆర్ఎస్ 100 కార్యకర్తలు పల్లె బాబురావు ఆధ్వర్యంలో వజ్రేష్‌యాదవ్, సుధీర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వేముల మహేష్‌గౌడ్, కర్రె రాజేష్, భాస్కర్, గోపు బాల్‌రాజ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ సీసీ భద్రేశ్వర్ మృతి

- తోటి ఉద్యోగుల ఘన నివాళి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీఆర్‌డీవో, తోటి ఉద్యోగులు తదితరులు

బషీరాబాద్, ఏప్రిల్ 18: మండలంలోని సెర్ప్(గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) కార్యాలయంలో సీసీగా పని చేస్తున్న వై.భద్రేశ్వర్ (56) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వికారాబాద్ డీఆర్‌డీవో ఎ.శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీవో సరోజినిదేవి తదితరులు తాండూరులోని మృతుడి నివాసానికి వచ్చి ఆయన భౌతిక కాయానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా అంత్యక్రియల కోసం రూ.20వేల నగదును వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు రామ్మూర్తి, హెచ్ఆర్ ఏపీఎం సంజుకుమార్, యూనియన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కార్యదర్శి రాంచందర్, ఏపీఎం పద్మారావు, తోటి సీసీలు బాలయ్య, శివయ్య, అనంద్, సేవ్యానాయక్, వివిధ మండలాల సీసీలు పలువురు పాల్గొని ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

వేర్వేరు చోట్ల

బెల్ట్ షాపులపై దాడులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 18: వేర్వేరుచోట్ల రెండు బెల్ట్ షాపులపై ఘట్‌కేసర్ పోలీసులు దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి ఎన్ఎఫ్‌సీనగర్‌లో పన్నాల మంగమ్మ ఇంట్లో బెల్ట్‌షాప్ నిర్వహిస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు దాడిచేయగా 140మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా కొండాపూర్‌లో కొంపల్లి కోటేశ్వర్‌రావు ఇంట్లో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడిచేశారు. 12 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కోటేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీఆర్ఎస్ ప్రచార రథాలు ప్రారంభం


ప్రచార రథాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వికారాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నిల ప్రచారం ప్రారంభించింది. గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ రమణ, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు మల్లేశం, బాబు చౌహన్, శ్రీను, కిషోర్ పాల్గొన్నారు.

అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 18: అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తిని ఎస్‌వోటీ పోలీసులు అరెస్టుచేశారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మేడ్చల్‌కు చెందిన విజయ్, రోజా, కుమార్, ముగ్గురు శామీర్‌పేట్ మండలంలోని తూంకుంట గ్రామంలోని ఓపెన్‌సైట్‌లో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈదాడిలో విజయ్‌ను అరెస్టు చేశరు. వారి వద్ద నుంచి మూడు జిలెటిన్ స్టిక్స్, ఒక వైర్ బండల్స్, ఒక కంప్రెషర్ బండిని స్వాధీనం చేసుకున్నాడు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

పెద్దేముల్, ఏప్రిల్ 18: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు బాధితుడికి అప్పగించారు. మండల కేంద్రానికి చెందిన గాండ్ల శేఖర్ కొద్దిరోజుల కిందట తన ఫోన్ పోగొట్టుకున్నాడు. ఎంతవెతికినా తన ఫోన్ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్‌ద్వారా అతడి వివరాలు అందులో నమోదుచేసి ఫోన్‌ను ట్రాక్‌చేశారు. ఫోన్ ఎవరివద్ద ఉందనే విషయాన్ని గుర్తించి వారినుంచి ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అట్టి సెల్‌ఫోన్‌ను బాధితుడు గురువారం గాండ్ల శేఖర్‌కు అప్పగించాడు. తనఫోన్ తనకు అప్పగించిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు సీఈఐఆర్ యాప్‌ద్వారా ఫిర్యాదు చేసుకుంటే ఫోన్‌ట్రాక్‌చేసి వారికి అప్పగిస్తామని ఎస్ఐ గిరి తెలిపారు.

క్రైం కార్నర్

క్వారీ నీటిలో దూకి యువకుడి ఆత్మహత్య


అంజిలప్ప మృతదేహాన్ని బయటకు తీస్తున్న గ్రామస్థులు

తాండూరురూరల్, ఏప్రిల్ 18: ఓ యువకుడు నాపరాతి క్వారీ నీటిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మల్కాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కాపూర్ గ్రామానికి చెందిన అక్కంపల్లి అంజిలప్ప(26) కొన్ని రోజులుగా ఎలాంటి పనిచేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో ఏదైనా పని చేసుకుని బతకాలని తల్లి, సోదరి మందలించారు. ఇందుకు జీవితంపై విరక్తిచెంది అంజిలప్ప గ్రామశివారులో ఉన్న నాపరాతి గని నీటిలో మునిగి ఆత్మహత్య చేసుకున్నాడు. క్వారీపక్కనే చెప్పులు, దుస్తులు ఉండటంతో స్థానికులు 100కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న కానిస్టేబుళ్ల ధన్‌రాజ్, ప్రతాప్ క్వారీ నీటిలో దిగి మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మరొకరు..

పరిగి, ఏప్రిల్ 18: ప్రేమ వ్యవహారంలో ఓ యువకుడు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని యాభాజీగూడ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు ఏడాది కాలంగా ఓ యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. వీరి పెళ్లికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో రాజ్‌కుమార్‌కు మరో యువతితో పెళ్లికి ఇటీవలే నిశ్చితార్థం అయింది. అయితే, తనను కాదని మరో యువతితో పెళ్లికి సిద్ధమయ్యాడంటూ సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు రాజ్‌కుమార్‌ను గురువారం స్టేషన్‌కు పిలిపించారు. అప్పటికే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన పోలీసులు వెంటనే అతన్ని పరిగి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని..

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 18: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట్ మండలం బాబాగూడ గ్రామానికి చెందిన కాసుల సంపత్(23) ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మూడు నెలల కింది నుంచి కంపెనీ యాజమాన్యం హోల్డ్‌లో పెట్టడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. శామీర్‌పేట్ నుంచి బొమ్మరాసిపేట్ గ్రామానికి వెళ్లే మార్గంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి


శేఖర్‌గౌడ్ మృతదేహం

బషీరాబాద్, ఏప్రిల్ 18: బైక్‌పై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డులో నారాయణపూర్ గేటు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిగకలాన్‌కు చెందిన శేఖర్‌గౌడ్(36) భార్య, కూతురుతో కలిసి తాండూరులో నివాసముంటున్నాడు. అక్కడే ఉంటూ ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. స్వగ్రామానికి వచ్చిన ఆయన మంగళవారం రాత్రి ఇంటినుంచి తాండూరుకు తన బైక్‌పై వెళ్తుండగా బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. తీవ్రగాయాలపాలైన శేఖర్‌గౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం పొలం యజమాని వచ్చి చూడగా అప్పటికే వ్యక్తి విగతజీవిగా పడి ఉన్నాడు. అటు వైపుగా జుంటుపల్లి జాతర ఉత్సవాలకు వెళ్తున్న బషీరా బాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ పరిశీలించారు. స్థానికులు మృతుడిని గుర్తుపట్టి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య సిద్దేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శేఖర్‌గౌడ్‌కు రూ.4లక్షల వరకు అప్పుకావడంతో ఎలాతీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యేవాడని కుటుంబసభ్యులు వాపోయారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్..

తాండూరు రూరల్, ఏప్రిల్ 18: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని నారాయణపూర్ గేటు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం మంతట్టి గ్రామానికి చెందిన మల్లేష్(30) ట్రాక్టర్ తీసుకుని తాండూరు వస్తున్నాడు. ఈ క్రమంలో తాండూరు మండలం నారాయణపూర్ గేటు వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.80వేలు తీసుకుని మోసం

పూడూరు, ఏప్రిల్ 18: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని ఓ వ్యక్తి మోసం చేశాడని బాధిత కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి కూతురు వర్షితకు ఈనెల 6వ తేదీన సెల్: 7369343354 నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. జాబ్‌కు ఎంపికయ్యావని, ఇంటి వద్దే ఉండి చేయవచ్చని మాయమాటలు చెప్పాడు. అంతేకాకుండా వర్షిత నుంచి రూ.80వేలు ఆన్‌లైన్ ద్వారా వసూలు చేశాడు. తర్వాత ఎలాంటి సమాచారం లేకపోవడంతో వర్షిత తండ్రి గోవర్ధన్‌రెడ్డి తన కూతురుకి జాబ్ ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చెన్‌గోముల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ మదుసూదనరెడ్డి తెలిపారు.

వివాహితపై యువకుడి లైంగికదాడి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 18: వివాహితపై యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత మహిళ(30) ఈనెల 16న సాయంత్రం ఘట్‌కేసర్‌లో పనికి వెళ్లి తిరిగి రాత్రి ఆటోలో స్వగ్రామానికి చేరుకుంది. ఆటోదిగిన మహిళ ఇంటికి నడుస్తూ వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఉమేష్‌నాయక్(22) అనే యువకుడు ఆమెను అడ్డగించి బలవంతంగా బైక్‌పై ఎక్కించుకున్నాడు. అనంతరం ఎల్‌బీజీ కాలనీ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. సదరు మహిళను బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. ఇంటికి చేరుకున్న మహిళ జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పింది. కుటుంబసభ్యులతో కలిసి గురువారం బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.